క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజలు

సంగం : శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సంగంలోని తిరుమనకొండపై కొలువైన రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరునికి సోమవారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. తొలుత గణపతిపూజ, కలశ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు విశేషంగా హాజరై ఆదిదంపతులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

జలదంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ శ్యామల సోమవారం తెలిపారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై చర్చించనున్నట్లు వివరించారు.

కావలి రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



కావలి : కావలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జీ రాజేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేస్తున్న కే శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. కాగా నూతన సీఐకు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

వీల్‌చైర్ అందజేత



వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన విద్యార్థి జంపాల విశ్వతేజకు వీల్‌చైర్‌ను ఉపాధ్యాయులు సోమవారం అందజేశారు. విశ్వతేజ 90శాతం శారీరక వైకల్యంతో బాధపడుతున్నాడు. వయస్సుతో పాటు బరువు పెరుగుతున్నందున విద్యార్థిని పాఠశాలకు తీసుకెళ్లడం తల్లిదండ్రులకు భారంగా మారింది. ఈ సమస్యను భవిత కేంద్రం ఐఆర్పీ కుమార్, ఉపాధ్యాయుడు పీ మనోహర్ మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. ఎంఈఓల కృషితో అన్వేష్ సంస్థ ద్వారా మంజూరైన వీల్‌చైర్‌ను విద్యార్థికి అందజేశారు.

ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి

కావలి : సమాజంలో రోజురోజుకు వైద్యులు, న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్న దృష్ట్యా వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఇసకల సాయి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కోలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటుతున్నాయన్నారు. ఈ తరుణంలో ఈ హత్యను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టడం శుభపరిణామమన్నారు. ఈ పరిణామమం బాధితురాలి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు.

బీజేపీ మండల కార్యాలయం ప్రారంభం



చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆదూరుపల్లి సెంటర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు జీ విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య పాల్గొన్నారు.

బీజేపీ పదాధికారుల సమావేశం

ఉదయగిరి: పట్టణంలో బీజేపీ పదాధికారుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేసేందుకు పదాధికారులతో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో బూత్ కమిటీలు వేసి సభ్యత్వాల నమోదును ముమ్మరం చేస్తామన్నారు. ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, మండలాధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు చల్లా సుబ్బరత్నం, షాజహాన్, సునో మియా, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలను ఆపాలని వినతి

ఉదయగిరి: వక్ఫ్ చట్ట సవరణలను ఆపాలని కోరుతూ ఆవాజ్ ఉదయగిరి మండల కమిటీ డిప్యూటీ తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. వక్ఫ్ చట్ట సవరణకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టంతో ముస్లింలలో ఉన్న పేద, బడుగు బలహీనవర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ, సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం..ప్రయాణం నరకం

ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తారు లేచిపోయి కంకర తేలి అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. దీంతో పల్లెవాసులకు ప్రయాణం నరకంగా మారింది.

- ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని గ్రామీణ రోడ్లు
- అడుగడుగునా గుంతలతో..
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వర్షంతో బురదమయంగా మారిన చేజర్ల-మాముడూరు రోడ్డు



యనమదలలో అధ్వానంగా ఉన్న రోడ్డు

ఉదయగిరి: ఉదయగిరి నియోజవర్గంలోని పల్లెలను కలిపే పలు రోడ్లు అధ్వానంగా మారాయి. ఏళ్ల క్రితం వేసిన తారురోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తారు, కంకర లేచిపోవడంతో అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహన దారులు సైతం ప్రయాణం అంటే హడలుతున్నారు.

- జడదేవి నుంచి తూర్పుచెన్నంపల్లి వరకు ఉన్న 4 కి.మీ తారురోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో బాడుగకు సైతం ఆటోలు, ఫోర్ వీలర్స్ వారు రావడం లేదు. ఫలితంగా రాత్రి వేళల్లో, అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- తిమ్మారెడ్డిపల్లి నుంచి చాకలకొండ వరకు ఉన్న రోడ్డు దక్కునూరు, తూర్పురొంపిదొడ్ల తదితర ప్రాంతాల్లో పూర్తిగా దెబ్బతింది. వింజమూరు నుంచి చాకలకొండ వరకు ఉన్న రోడ్డు అదే విధంగా ఉంది. ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.
- కలిగిరి నుంచి కొండాపురం వరకు ఉన్న రోడ్డు అన్నలూరు, కుదుమలదిన్నెపాడు, ఆదిమూర్తిపురం, జంగాలపల్లి, తదితర గ్రామాల వద్ద అధ్వానంగా ఉంది.
- వింజమూరు–గుండెమడకల రోడ్డు సైతం కొంతమేర పూర్తిగా దెబ్బతింది.
- జలదంకి మండలంలో తొమ్మిదో మైలు నుంచి బ్రహ్మణక్రాక వెళ్లే రోడ్డు సైతం గుంతలమయంగా తయారవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నడుములు హూనమవ్వాల్సిందే

చేజర్ల: మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా కాకివాయి నుంచి చేజర్ల వరకు సుమారు 16 కిలోమీటర్ల దూరం దారుణంగా ఉంది. కాకివాయి–బిల్లుపాడు, యనమదల–చేజర్ల మధ్యన రోడ్డు అడుగడుగునా గుంతలతో నిండడడంతో ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు. చేజర్ల–మాముడూరు రోడ్డు కూడా కంకర లేచిపోయి దారుణంగా తయారైంది. చేజర్ల–పాడేరు మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షం పడితే రోడ్డు బురదమయంగా మారుతోంది. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లని పరిస్థితి. దీంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేజర్ల నుంచి వైద్య సేవలకు కలువాయికి రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న తిమ్మారెడ్డిపల్లి-చాకలకొండ రోడ్డు



దెబ్బతిన్న జడదేవి-చెన్నంపల్లి రోడ్డు

గుంతలను పూడ్చాలి



చేజర్ల మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు దారుణంగా ఉన్నాయి. గుంతలతో నిండిన రోడ్లపై రాకపోకలు సాగించాలంటే నరకాన్ని చవిచూస్తున్నాం. అధికారులు స్పందించి కనీసం తాత్కాలికంగా గుంతలనైనా పూడ్చాలి.

– దామోదర్‌రెడ్డి, చేజర్ల

ఆటోలు రావడం లేదు



మా గ్రామానికి ఇరవై ఏళ్ల క్రితం రోడ్డు వేశారు. అప్పటి నుంచి కొంత కాలం రాకపోకలు సజావుగా సాగాయి. గత పదేళ్ల నుంచి రోడ్డు పూర్తిగా దెబ్బతింటూ వస్తోంది. ప్రస్తుతం కంకర తేలి కనీసం నడవ లేని పరిస్థితికి వచ్చింది. కనీసం వాహనదారులు బాడుగకు కూడా రావడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి తారు రోడ్డు వేయాలి.

–కొండయ్య, తూర్పుచెన్నంపల్లి

నరకాన్ని చవిచూస్తున్నాం



చేజర్ల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఉన్న లింక్ రోడ్లు దారుణంగా ఉన్నాయి. కనీసం ద్విచక్ర వాహనంపై కూడా పోలేకపోతున్నాం. అడుగడుగునా గుంతలతో నిండడంతో నడుములు హూనమవుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలి.

– వంటేరు సుధీర్‌రెడ్డి, చేజర్ల

ప్రతిపాదనలు పంపుతాం

దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నాం. ఇప్పటికే కొన్ని రోడ్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపాం. దెబ్బతిన్న రోడ్ల గుంతలను త్వరలోనే పూడ్చుతాం.

–చక్రధర్,
డీఈ, ఆర్‌అండ్‌బీ, ఉదయగిరి

వైభవంగా హనుమంత సేవ



ఎడ్ల బండ లాగుడు పోటీలు

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా కృష్ణంపల్లిలో ఎడ్ల బండలాగుడు పోటీలను సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా రంగసానిపల్లికి చెందిన ఎం వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.40,116 నగదును దక్కించుకున్నాయి. వైఎస్సార్ జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన మూలె సూరారెడ్డి ఎడ్లు ద్వితీయ బహుమతి రూ.30,115, అదే గ్రామానికి చెందిన మూలె హరిప్రసాద్‌రెడ్డి ఎడ్లు తృతీయ బహుమతి రూ.20,116 నగదును గెలుచుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న మరో నాలుగు జతల ఎడ్ల యజమానులకు రూ.10 వేలు చొప్పున నగదును ఆలయ నిర్వాహకులు అందజేశారు.

గిరిజనులపై దాడి.. గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసె వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

అనుమసముద్రంపేట: గిరిజన కుటుంబంపై కొందరు దాడికి పాల్పడడమే కాకుండా గుడిసెను దగ్ధం చేసిన ఘటన గుంపర్లపాడు గిరిజన కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు..గిరిజనులైన యాకసిరి వెంకటరమణయ్య, చెంచులక్ష్మి దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. గత మూడేళ్లుగా గ్రామంలో నివాసం ఉంటున్నారు. అందరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి వెంకటరమణయ్య, కుమారుల నడుమ చిన్నపాటి గొడవ నెలకొంది. ఆ సమయంలో పక్కనే నివాసం ఉంటున్న వెంకయ్య తనను బూతులు తిడుతున్నారంటూ తన బంధువులతో కలిసి గిరిజనులను చితకబాదారు. దీంతో గిరిజనులు గ్రామంలోకి పరారయ్యారు. ఆ తరువాత ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గిరిజనుల గుడిసె దగ్ధమవుతూ కనిపించింది. గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే పూర్తిగా కాలిపోయింది. గిరిజన కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. దీనికి కారణం వెంకయ్యేనంటూ బాధితులు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, వారు సీఎం చంద్రబాబునాయుడు పర్యటనకు వెళ్లి ఉన్నారని తెలిపారు. పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు స్పందించి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీన్ కృష్ణారెడ్డి

ఉదయగిరి: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి సూచించారు. ర్యాగింగ్ నిరోధక వారోత్సవాల్లో భాగంగా సోమవారం వ్యవసాయ కళాశాలలోని విద్యార్థులకు ర్యాగింగ్ వలన కలిగే దుష్పరిణామాలు, తీసుకునే చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్, సీనియర్ అనే తారతమ్యం లేకుండా విద్యార్థులు పరస్పరం సహకరించుకుంటూ విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. జూనియర్లకు సీనియర్లు ఆదర్శంగా ఉండాలని, వారు మంచి మార్గంలో నడిచేలా సహకరించాలని కోరారు. ర్యాగింగ్‌తో జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రమేష్, ప్రొఫెసర్లు కిరణ్‌తేజ, టీనా, బాలు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

వరికుంటపాడు: మండలంలోని తూర్పు బోయమడుగుల ఎస్టీ (యానాది) కాలనీకి చెందిన బాపట్ల మణియ్య (60) పాముకాటుకు గురై మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. మణియ్య ప్రకాశం జిల్లా పామూరు మండలం బుక్కాపురం గ్రామంలో బొగ్గు కార్మికుడిగా పనిచేసేవాడు. ఈనెల 11వ తేదీన పని చేస్తూ పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ 17వ తేదీన మృతిచెందాడు. సోమవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సీఎం పర్యటనతో పవర్ కట్

– ఇబ్బందులు పడిన సోమశిల గ్రామస్తులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో సోమశిలలో సోమవారం ఉదయం నుంచే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు సోమశిల గురుకుల పాఠశాల వద్ద హెలిప్యాడ్ నిర్మించారు. సాయంత్రం 3.20 గంటలకు ముఖ్యమంత్రి వస్తారని షెడ్యూల్‌లో ఉండగా ఉదయం 10 గంటల నుంచే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. హెలికాప్టర్ దిగేందుకు అడ్డుపడుతాయన్న కారణంతో కొన్ని వీధుల్లోని విద్యుత్ తీగలను సిబ్బంది తొలగించారు. తీవ్రమైన ఎండ నేపథ్యంలో విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల 4వ వార్డుకు చెందిన పసుపులేటి వేణు, 8వ వార్డుకు చెందిన పఠాన్ నసీబ్, 9వ వార్డుకు చెందిన రాగి వెంకటమ్మ, పోకూరు లక్ష్మమ్మ మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు చొప్పున నగదు అందజేశారు.

సీఐకు సన్మానం



కావలి : కావలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన కే శ్రీనివాసరావును డీఎస్పీ ఎం వెంకటరమణ సోమవారం ఘనంగా సత్కరించారు. కావలి రూరల్ సీఐగా అందించిన సేవలను కొనియాడారు. కావలి వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు పాల్గొన్నారు.

సత్యనారాయణుని వ్రతం

అల్లూరు: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని నగర పంచాయతీ పరిధిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

మృతుడి వివరాలు లభ్యం

మర్రిపాడు: మర్రిపాడు సమీపంలో గత శుక్రవారం లభ్యమైన గుర్తుతెలియని మృతదేహాన్ని మైదుకూరుకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ మహబూబ్‌బాషాదిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని మృతుడి కుటుంబసభ్యులు సోమవారం తమను సంప్రదించారని చెప్పారు. మృతికి గల కారణాలు తెలియరాలేదన్నారు.

జీపు వేలం

ఉదయగిరి: ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్‌లో ఉన్న 1982 మోడల్ జీపును వేలం వేయనున్నట్లు సీడీపీఓ పచ్చవ లావణ్య సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 30వ తేదీలోగా రూ.300 డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న సేవియర్స్ సభ్యులు

కావలి : కోలోకత్తాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ సేవియర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. 'జస్టిస్ ఫర్ మౌనిక' అని దీపాలు వెలిగించి బాధితురాలికి నివాళులర్పించారు. బాధితురాలి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు కనుమల్లపూడి భార్గవ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడడం హేయమన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా దోషులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. సేవియర్స్ సభ్యులతో పాటు వైద్యులు డాక్టర్ నళిని పద్మ, డాక్టర్ పద్మజ అభయం స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వెంకటేశ్వర్లు ,మోహన్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కలిగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. 2023 –2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 23 పంచాయతీల్లో రూ.14.85 కోట్లతో 1216 పనులు చేపట్టారు. ఈ పనులను తనిఖీ చేసి సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై ప్రిసైడింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి సమీక్షించారు. పంచాయతీల వారీగా పనుల్లోని అవకతవకలు, కొలతల తేడాలను నమోదు చేసుకుని రికవరీలకు ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని పంచాయతీల్లో క్షేత్రసహాయకులు, సీనియర్‌మేట్లను తొలగించడంతో వారు ప్రజావేదికకు హాజరుకాలేదు. ఆయా పంచాయతీలకు సంబంధించిన ఉపాధి అధికారులు, సిబ్బందే నివేదికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్, ఏపీడీ గాయత్రిదేవి, అంబుడ్స్‌మెన్ అధికారి వెంకటరెడ్డి, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఏపీఓ శ్రీనివాసులు, సీఆర్పీ నాగార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండగ



ఆత్మకూరురూరల్: తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి



ఉషశ్రీకి రాఖీ కడుతున్న తిరుమనకొండ పీఠాధిపతి

ఆత్మకూరురూరల్/ఉదయగిరి/సంగం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సోమవారం వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. అక్కచెల్లెమ్మలు తమ సోదరులకు రాఖీలను కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వాదాలు పొందారు. సంగంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయానికి వచ్చిన మహిళలకు పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రముఖ లలితా ఉపాసకురాలు ఉషశ్రీ మాస్టర్‌ను తన సోదరిగా భావించి రాఖీ కట్టడంతో మహిళలు హర్షించారు. స్త్రీలందరూ లలితా స్వరూపులేనని, సమాజాభివృద్ధికి, శాంతి స్థాపనకు కృషి చేయాలని, ప్రతి స్త్రీలో దైవశక్తి అధికంగా ఉంటుందని ఆయన తెలిపారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ముగిసిన సీఎం చంద్రబాబు పర్యటన



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సోమశిల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 10 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన తడలోని శ్రీసిటి పారిశ్రామికవాడను చేరుకుని కొన్ని పరిశ్రమలను ప్రారంభించారు. అనంతరం సాయంత్రం 3.20 గంటలకు సోమశిలకు గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. సీఎంకు కలెక్టర్ ఆనంద్, ఆత్మకూరు ఆర్డీఓ మధులత పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సోమశిల జలాశయాన్ని సీఎం సందర్శించి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో పాల్గొన్నారు. ప్రజావేదిక పూర్తయిన తరువాత సాయంత్రం 5.30 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి పయనమయ్యారు. కాగా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సీఎం పర్యటన విజయవంతంతో రెవెన్యూ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకట రమణారెడ్డి, ఈఈ మల్లికార్జున, డీపీఓ సుస్మితారెడ్డి, డీఆర్డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.